సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



వెలిసిన మావోయిస్టు పోస్టర్లు

ఎటపాక మండలం గౌరిదేవిపేట నుంచి తోటపల్లి బ్రిడ్జి వరకు ప్రధాన రహదారిపై మావోయిస్టుల పేరిట పోస్టర్లు వెలిశాయి. 8లో



ఇటుకల పండగ సందడి

హుకుంపేట: ఇటుకల పండగ సందడి నెలకొంది. డప్పు వాయిద్యాలు, థింసా నృత్యాలతో ఉత్సాహంగా గడుపుతున్నారు.



వాతావరణం

సాక్షి, పాడేరు: పాడేరు, అరకు ప్రాంతాల్లో శుక్రవారం ఎండతీవ్రత కాస్త తగ్గింది. చింతపల్లిలో 37 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్టు ప్రాంతీయ పరిశోధన స్థానం తెలిపింది.

న్యూస్‌రీల్

అంబులెన్సుకు దారివ్వని కూటమి శ్రేణులు



గడుగుపల్లి సమీపంలో ట్రాఫిక్ కారణంగా నిలిచిపోయిన 108 వాహనం

అరకులోయ రూరల్: కూటమి అభ్యర్థి పాంగి రాజారావు నామినేషన్ కార్యక్రమానికి విచ్చేసిన శ్రేణుల వల్ల అంబులెన్సుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. శుక్రవారం పాడేరు ఐటీడీఏలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేసేందుకు ఆయన కూటమి నేతలతో ర్యాలీగా రావడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది.అదే సమయంలో పాడేరు వైపు నుంచి వస్తున్న 108 అంబులెన్సుకు గడుగుపల్లి వద్ద దారివ్వకపోవడంతో కొంతసేపు నిలిచిపోయింది. దీనివల్ల వాహన సిబ్బందితోపాటు రోగి తరపు బంధువులు ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ ఈవిషయాన్ని అభ్యర్థి, కూటమి శ్రేణులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది.

ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు

- వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్, చిత్రంలో కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు పంకజ్‌సింగ్ ఆదేశించారు.శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ విజయసునీత,జ ఎస్పీ తుహిన్‌సిన్హా, పాడేరు, అరకు ఆర్‌వోలు భావన వశిష్ట, అభిషేక్‌తోపాటు వ్యయ పరిశీలన బృందంతో ఆయన సమావేశమయ్యారు. రంపచోడవరం నుంచి వర్చువల్ విధానంలో ఆర్‌వో ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పంకజ్‌సింగ్ మాట్లాడుతూ అన్ని సవాళ్లను అధిగమిస్తూ జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల వ్యయ నివేదికలను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలన్నారు. దీనిపై అన్ని రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే కలెక్టరేట్‌లోని జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. మీడియా మానటరింగ్, సోషల్ మీడియా,సి-విజిల్, కాల్‌సెంటర్, ఎంసీసీ, బోర్డర్ చెక్‌పోస్టుల వెబ్ నిర్వహణను పరిశీలించారు. డీఆర్వో పద్మావతి, నోడల్ అధికారులు సువర్ణ ఫణి, గోవిందరాజులు, రాములు, సాయినవీన్, రమేష్‌కుమార్ రావు, పూర్ణయ్య, రామకృష్ణరాజు పాల్గొన్నారు.



ఆత్మీయతకు వందనం



సీఎం బస్సు యాత్ర దిగ్విజయంగా సాగాలని దిష్టి తీస్తున్న మహిళలు

నాడు..
ఒక్క అడుగు...
రాష్ట్రంలో సంక్షేమ చరిత్రను లిఖించింది..
అవ్వాతాతల మోముల్లో చిరునవ్వు విరబూయించింది..
అక్కా చెల్లెమ్మలకు ఆసరా ఇచ్చింది...
చిన్నారులను అమ్మ ఒడిలా లాలించి విద్యాదీవెనలు అందించింది..
ప్రతి గుండెకు ఆరోగ్య సురక్షగా నిలిచింది
ప్రతి రైతుకు భరోసా ఇచ్చింది
లక్షలాది మందికి నీడనిచ్చింది...
ఆ మహాపథికుడు, జన హృదయాధినేత, సంక్షేమ రథసారథి

నేడు
కోట్లాది మంది ఆశీస్సులతో
మళ్లీ మనముందుకొచ్చాడు..
ఎన్నికల సమరానికి శంఖం పూరించి...
బస్సు యాత్రతో సిద్ధమై
వచ్చాడు..
మండువేసవిలో చిరునవ్వుల
వెన్నెలై వచ్చాడు...
ఆ వెన్నెలలో తడిసి ముద్దయిన
వేలాది జనం జేజేలతో
సాదర స్వాగతం పలికారు...
జయహో...జగనన్న అంటూ
నీరాజనాలు పలికారు...

జయహో... జగనన్న

- సీఎం బస్సు యాత్రకు బ్రహ్మరథం
- పాయకరావుపేటలో ఘనంగా స్వాగతం
- హారతులిచ్చి దీవించిన మహిళలు
- జగనన్నను చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన అభిమానులు

నక్కపల్లి : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణాలు రానే వచ్చాయి. సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాలుగా రాష్ట్ర అభ్యుదయ రథాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శుక్రవారం రాత్రి అనకాపల్లి జిల్లాలో అడుగుపెట్టింది. రాత్రి 9 గంటలకు సీఎం బస్సు యాత్ర జిల్లా సరిహద్దు పాయకరావుపేటకు చేరుకుంది. వేలాది మంది పార్టీ శ్రేణులు జాతీయ రహదారిపైకి వచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కనోసా పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు అర కిలోమీటరు దూరంలో ఉన్న జాతీయరహదారి పైకి చేరుకుని ఇరువైపులా నిలుచుని పార్టీ శ్రేణులు, యువకులు, మహిళలు, జగకార్యకర్తలు, అభిమానులు జగనన్నకు ఘన స్వాగతం పలికారు. తనను చూడడానికి వేలాదిగా తరలివచ్చిన జన సందోహానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బస్సుపై నుంచి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను ప్రజలకు బస్సుపై నుంచే పరిచయం చేస్తూ రెండు చేతులు జోడించి ముందుకు సాగారు. వై జంక్షన్‌లో మహిళలు హారతులివ్వడంతో పాటు గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి దిష్టి తీసి జగనన్న బస్సుయాత్ర ఏ ఆటంకాలు లేకుండా దిగ్విజయంగా పూర్తి కావాలని, మే 13న జరిగే ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి కావాలని దీవించారు. రాత్రి 9 గంటల సమయంలో కూడా పాయకరావుపేట పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది మంది తరలిరావడంతో జాతీయ రహదారి జన సంద్రమైంది. జై జగన్.. జైజై జగన్, మళ్లీ నువ్వే సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. పాయకరావుపేటలో బస్సుయాత్రకు స్వాగతం పలికినవారిలో పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎంఎస్ఎంఈ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బోలిశెట్టి గోవింద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దత్తుడు సీత బాబు తదితరులు ఉన్నారు.



పాయకరావుపేటలో జగన్ రాకకోసం రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్న జనం

గొడిచర్ల వద్ద రాత్రి బస..

పాయకరావుపేట నుంచి నక్కపల్లి మండలం గొడిచర్ల జాతీయరహదారి పక్కన ఏర్పాటు చేసిన వసతి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాత్రి బస చేశారు. గొడిచర్ల వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ, సర్పంచ్ అల్లు రమణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పాపారావు, మణిరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు, సర్పంచ్‌లు భార్గవ్, సురేష్ వర్మ, సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ తిరుపతిరావు, గోవిందు ఆధ్వర్యంలో వందలాది మంది సీఎం బస్సు యాత్రకు స్వాగతం పలికారు.



ర్యాంప్‌కు తుది మెరుగులు

మోగనున్న సమర శంఖం

- నేడు జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో సీఎం జగన్ యాత్ర
- 70 కిలోమీటర్ల మేర రోడ్ షో
- కశింకోట మండలం చింతలపాలెం వద్ద భారీ బహిరంగ సభ
- చిన్నయ్యపాలెం వద్ద సీఎం రాత్రి బస

సాక్షి, అనకాపల్లి : సీఎం బస్సుయాత్ర జిల్లాలో శనివారం ఉదయం పాయకరావుపేట నియోజకవర్గం దొడ్డిగల్లు నుంచి ప్రారంభమై నాలుగు నియోజకవర్గాల్లో జరగనుంది. సార్వత్రిక ఎన్నికలకు తెర లేచిన తరువాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు, పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నారు.

సీఎం పర్యటన ఇలా...

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం ఉదయం 9 గంటలకు పాయకరావుపేట నియోజకవర్గం గొడిచెర్ల నుంచి ప్రారంభమవుతుంది. ఉద్దండపురం, కాగిత, సీతంపాలెం, నక్కపల్లి, అడ్డరోడ్డు, పులపర్తి, రేగుపాలెం, యలమంచిలి బైపాస్ మీదుగా మధ్యాహ్నం 12.30 గంటలకు అచ్యుతాపురంలో గల లంచ్ పాయింట్ క్యాంప్‌కు చేరుకుంటారు. అనంతరం కశింకోట మండలం నరసింగపల్లి సమీపంలోని చింతలపాలెం వద్ద బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు జరిగే బహిరంగ సభలో సీఎం వై.ఎస్ జగన్ ప్రసంగిస్తారు. అనంతరం తాళ్లపాలెం జంక్షన్, బయ్యవరం, కశింకోట, కొత్తూరు, అనకాపల్లి జంక్షన్-1, జంక్షన్-2, శంకరం, రేబాక, మర్రిపాలెం టోల్‌గేట్, దేవీపురం, అస్కపల్లి మీదుగా రాత్రి 8.30 గంటలకు సబ్బవరం మండలంలోని చిన్నయ్యపాలెంలో గల టిర్రకాన్ రాయల్ వెంచర్ వద్దకు చేరుకుని అక్కడ రాత్రి బస చేయనున్నారు.

అరకు పార్లమెంట్‌కు నాలుగు నామినేషన్లు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి లకే రాజారావు

పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీకి 9 సమర్పణ

సాక్షి, పార్వతీపురం మన్యం: అరకు పార్లమెంట్ స్థానానికి రెండోరోజు శుక్రవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి తరపున కుటుంబ సభ్యులు ఒక సెట్ నామినేషన్‌ను కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు అందజేశారు. సీపీఐ, కాంగ్రెస్ మద్దతుతో ఇండియా వేదిక బలపర్చిన సీపీఎం అభ్యర్థి పి.అప్పలనర్స, బీజేపీ నుంచి బహిష్కరణకు గురైన నిమ్మక జయరాజుతో పాటు, పాలక రంజిత్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు.

పాడేరు అసెంబ్లీకి రెండు..

సాక్షి,పాడేరు: పాడేరు అసెంబ్లీ స్థానానికి శుక్రవారం రెండు నామినేషన్లు అందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట తెలిపారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మత్స్యరాస విశ్వేశ్వరరాజు, టీడీపీ ప్రకటిత అభ్యర్థి కిల్లు వెంకట రమేష్‌నాయుడు ఒకొక్క సెట్ చొప్పున నామినేషన్లు అందజేశారు.

అరకు అసెంబ్లీకి ఆరు..

పాడేరు : అరకు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్య్ర అభ్యర్థులు సమర్థి రఘునాథ్, సమర్థి గులాబీ, టీడీపీ రెబల్ అభ్యర్థిగా సివేరి అబ్రహం, బీఎస్పీ తరపున లకే రాజారావు, కూటమి అభ్యర్థిగా బీజేపీకి చెందిన పాంగి రాజారావు, డమ్మీ అభ్యర్థిగా కూడా ఆయన నామినేషన్ వేశారు. వీరి నుంచి ఆర్‌వో, ఐటీడీఏ పీవో అభిషేక్ స్వీకరించారు.

సొంతిల్లు లేని విశ్వేశ్వరరాజు



పాడేరు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజుకు సొంతిల్లు, భూములు లేవు. చరాస్తులు రూ.16,27,010గా ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భార్య శివా రత్నం పేరిట చరాస్తులు 16,10,378 ఉన్నట్టుగా ఆయన తెలిపారు. - సాక్షి,పాడేరు

రంపచోడవరం అసెంబ్లీకి ఒకటి..

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీకి శుక్రవారం టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీష దేవి నామినేషన్ అందజేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంతకుమార్ తెలిపారు.

ముమ్మరంగా తనిఖీలు



వై.రామవరం: మండల కేంద్రం నుంచి అడ్డతీగల వెళ్లే ప్రధాన రహదారిలో శుక్రవారం ఎస్ఐ ఎం. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో బాంబు స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. ఈ మార్గంలో అనుమానాస్పద ప్రదేశాలు, కల్వర్టులను తనిఖీ చేసింది. అపరిచితులు, సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ అసిస్టెంటు కమాండెంటు ఎంఎల్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా విశ్వేశ్వరరాజు నామినేషన్





ఎన్నికల రిటర్నింగ్ అధికారి భావన వశిష్టకు నామినేషన్ పత్రం అందజేస్తున్న పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పక్కన అరకు ఎంపీ మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర,ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జీకేవీధి జెడ్పీటీసీ కిముడు శివారత్నం

- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ర్యాలీగా వెళ్లి సమర్పణ
- పాడేరులో హోరెత్తిన జై జగన్ నినాదాలు

సాక్షి,పాడేరు: పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ సమర్పించారు. నియోజకవర్గంలో ఐదు మండలాల నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, నేతలతో రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అందజేశారు. భారీగా శ్రేణులు తరలిరావడంతో పార్టీ జెండాలు రెపరెపలాడాయి. జయహో జగనన్న.. జయహో వైఎస్సార్‌సీపీ నినాదాలు హోరెత్తాయి. ముందుగా విశ్వేశ్వరరాజు, శివారత్నం దంపతులు పట్టణంలో మోదకొండమ్మ ఆలయంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, పాడేరు, చింతపల్లి జెడ్పీటీసీలు కిముడు గాయత్రి, పోతురాజు బాలయ్య, పాడేరు పరిశీలకులు కె.శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మి తదితరులతో కలిసి పూజలు చేశారు. నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల వద్ద ఉంచి కుంకుమార్చన జరిపించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు విశ్వేశ్వరరాజుకు అభినందనలు తెలిపారు. పార్టీ శ్రేణులు ఆయనను శాలువాలతో సత్కరించారు. అనంతరం వారితో కలిసి విశ్వేశ్వరరాజు ప్రచార రథంపై పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తీన్‌మార్ డప్పులు, థింసా నృత్యాలు, కార్యకర్తలు డ్యాన్సులతో హోరెత్తించారు. పాడేరు పాత బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ సాగింది. జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలతో ప్లకార్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అరకు ఎంపీ మాధవి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో విశ్వేశ్వరరాజు తన నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్టకు అందజేశారు.



మోదకొండమ్మతల్లికి పూజలు చేస్తున్న మత్స్యరాస విశ్వేశ్వరరాజు,శివారత్నం దంపతులు



అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణతో విశ్వేశ్వరరాజు



నామినేషన్ వేసేందుకు ప్రచార రథంపై వెళ్తున్న అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాత కక్షలతోనే చంపేశారు

- సంచలనమైన వైఎస్సార్‌సీపీ కన్నాయిగూడెం ఎంపీటీసీ దారుణ హత్య
- దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు
- నిందితులను అదుపులోకి తీసుకున్న చింతూరు ఏఎస్పీ
- మృతదేహానికి భద్రాచలం ఆస్పత్రిలో పోస్టుమార్టం
- నివాళులర్పించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



రహదారిపై బాలకృష్ణ జోహార్ అంటూ నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ఎంపీటీసీ బాలకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ఎటపాక: పాత కక్షలే కన్నాయిగూడెం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ వర్సా బాలకృష్ణ (40) హత్యకు దారితీసినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన రమేష్, అతని స్నేహితుడు సాయిరాం కలిసి బాలకృష్ణకు ఫోన్‌చేసి వారు ఉన్నచోటకు రప్పించి దాడికి పాల్పడ్డారు. అతను కిందపడిపోవడంతో తలపై బండరాయి పడేసి హతమార్చారు. రంగంలోకి దిగిన చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా నిందితులిద్దరిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

రెండేళ్ల నుంచి తగాదాలు..

మృతుడు ఎంపీటీసీ బాలకృష్ణ, అదే గ్రామానికి చెందిన సీపీఐ నేత రమేష్‌కు మధ్య రెండేళ్లుగా తగాదాలు జరుగుతున్నాయి. గిరిజనేతరుడైన రమేష్‌పై ఎటపాక, భద్రాచలం పోలీసుస్టేషన్లలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈనేపథ్యంలో బాలకృష్ణను అంతం చేద్దామన్న పథకంతో రమేష్ వ్యూహం రూపొందించాడు. గురువారం రాత్రి గ్రామంలోని వివాహ కార్యక్రమానికి వెళ్లిన బాలకృష్ణకు తామున్న చోటకు రమ్మని స్నేహితుడు సాయిరాంతో కలిసి రమేష్ ఫోన్ చేశాడు. వారితో మాట్లాడుతుండగా అక్కడే ఉన్న బాలకృష్ణ తమ్ముడు శివరామకృష్ణ విషయం తెలుసుకున్నాడు. రమేష్‌తో మాట్లాడవద్దని బాలకృష్ణకు అతను సూచించాడు. అక్కడ భోజనం అనంతరం అన్న బాలకృష్ణను ఇద్దరు యువకుల సాయంతో ఆటోలో ఇంటికని పంపించాడు. అక్కడినుంచి తాను ఉంటున్న భద్రాచలం వెళ్లిపోయాడు.

తమ్ముడు వారించినా..

ఇద్దరు యువకులతో ఆటోలో ఇంటికి బయలుదేరిన బాలకృష్ణ మళ్లీ వెనక్కి వచ్చి గ్రామ శివారులో రమేష్, సాయిరాం ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఈ ఇద్దరు బాలకృష్ణతో గొడవకు దిగి దాడి చేశారు. దీంతో కిందపడిపోయిన అతన్ని కదలకుండా కాళ్లను సాయిరాం పట్టుకోగా తలపై రమేష్ బండరాయి వేయడంతో తీవ్ర రక్తస్రావంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. బాలకృష్ణతో వచ్చిన ఇద్దరు యువకులు భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. రమేష్‌కు చేతికి గాయం కావడంతో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి వెళ్లాడు. సంఘటన సమాచారం తెలుసుకున్న సీఐ రామారావు అర్ధరాత్రి గ్రామానికి వెళ్లి దర్యాప్తు వేగవంతం చేశారు. సెల్ సంకేతాలు ఆధారంగా అతను ఉన్న ప్రాంతాన్ని పోలీసులు గుర్తించి ఏఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు సాయిరాంను కూడా పోలీసులు పట్టుకున్నారు. బాలకృష్ణ మృతదేహానికి భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన తెలంగాణలోని దుమ్ముగూడెం మండలం మారేడుబాక తరలించారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అక్కడికివెళ్లి నివాళులర్పించారు. ఆమె తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో కన్నాయిగూడెంలో భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

ఎస్సీఎస్టీ కేసుల నమోదుతో..

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఎంపీటీసీగా ఏకగ్రీవంగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. అప్పటి నుంచి అతనిపై ప్రత్యర్థి పార్టీ నేతలు పగబట్టి తరచూ గొడవలు పడుతుండేవారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 2022లో బాలకృష్ణ, రమేష్ కుటుంబాల మధ్య జరిగిన గొడవలు కేసులు వరకు దారితీశాయి. దీనిలో భాగంగానే రమేష్‌పై ఎటపాక, భద్రాచలం పోలీసుస్టేషన్లలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈ కక్షతోనే బాలకృష్ణను రమేష్ పథకం ప్రకారం హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎంపీటీసీ బాలకృష్ణను దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఘటనలో కూటమి నేతల ప్రమేయం ఉందని వారు ఆరోపిస్తూ ధర్నా చేశారు. వారిపై కూడా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హత్యను ఆదివాసీ సంఘాల నేతలు ఖండించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఎంవీపీకాలనీ: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు జిలా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.పోలినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా సమావేశంలో నిర్ణయాలు ఉంటాయన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం ఉంటుందని వెల్లడించారు.

నేడు ఏకలవ్య పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష

వై.రామవరం: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 20 (శనివారం)న పరీక్ష జరుగుతుందని వై.రామవరం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్/ ఏకలవ్య ప్రవేశపరీక్ష కన్వీనర్ శ్రీపాద రామకృష్ణ తెలిపారు. ఆరోజు ఉదయం 11.30 నుంచి1.30 వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడు చేసు కోవాలని ఆయన సూచించారు. ప్రవేశపరీక్ష రంపచోడవరం బాలికల, బాలుర గురుకుల పాఠశాలల, రాజఒమ్మంగి బాలికల గురుకుల పాఠశాల, చింతూరు ఏకలవ్య పాఠశాల, చింతూరు పీటీజీ బాలుర గురుకుల పాఠశాలల్లో జరుగుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకోసం 9490957247, 9490876026 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీకి రె'బెల్స్' గుబులు

- టీడీపీలో కొనసాగుతున్న సీట్ల ఫైట్
- మాడుగుల అభ్యర్థిగా పైలా నామినేషన్
- పాడేరు నుంచి నామినేషన్ వేసిన కిల్లో రమేష్ నాయుడు
- టికెట్ మార్చి గిడ్డి ఈశ్వరికి ఇస్తారంటూ జోరందుకున్న ప్రచారం
- మాడుగుల అభ్యర్థిగా 22న నామినేషన్ వేస్తానని బండారు ప్రకటన
- అరకులో చంద్రబాబుపై యుద్ధం ప్రకటించిన సివేరి అబ్రహం
- అదే బాటలో దొన్నుదొర.. నామినేషన్ వేసేందుకు సిద్ధం


నామినేషన్ దాఖలు చేస్తున్న టీడీపీ రెబల్ అభ్యర్థి సివేరి అబ్రహం

సాక్షి, విశాఖపట్నం: వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన టీడీపీ అధినేత చంద్రబాబు టికెట్ల కేటాయింపు విషయంలోనూ అదే పద్ధతి పాటిస్తున్నారు. తొలుత ప్రకటించిన అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో ఆ పార్టీ నేతలు అధినేత తీరుపై మండిపడుతున్నారు. మరో వైపు నామినేషన్లు వేసిన తర్వాత కూడా అభ్యర్థులను మార్చుతారన్న సంకేతాలు రావడంతో భంగపడ్డ నాయకులు టీడీపీ రెబల్స్‌గా బరిలోకి దిగడానికి సిద్ధమయ్యారు. మాడుగుల, పాడేరు, అరకు.. ఇలా ప్రతిచోటా రెబెల్స్ మోగుతున్నాయి. దీంతో తిరుగుబావుటా ఎగరేసిన వారికి తాయిలాలు.. నామినేటెడ్ పదవులు ఇస్తామని జపిస్తున్నా.. చంద్రబాబు మాటలు నమ్మడం లేదు. అసలు ఎన్ని పదవులు ఉంటాయి.. ఒకే పదవి ఎంత మందికి ఇస్తారు.. అని భావించిన టికెట్ రాని టీడీపీ నేతలు రెబల్స్‌గా బరిలో దిగుతామని స్పష్టం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల టికెట్ ఆశించి భంగపడిన వారంతా లోలోపల రగిలిపోతున్నారు.

బండారు ఇన్.. పైలా అవుట్ !

మాడుగుల టికెట్ పైలా ప్రసాద్‌కు కేటాయించారు. దీంతో ఆయన శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే బీ ఫారం ఇవ్వకముందే.. బండారు సత్యనారాయణమూర్తి తనకే టికెట్ ఇస్తారని నియోజకవర్గంలోకి ఎంట్రీ ఇచ్చారు. దీంతో పైలాకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారనే ప్రచారం సాగుతోంది. ఒకే వేళ తన సీటు మార్చితే లోకల్‌గా ఉన్న గవిరెడ్డి లేదా కుమార్‌కు ఇచ్చినా తాను సహకరిస్తాను తప్పా ఎక్కడి నుంచో వచ్చిన బండారుకు సహకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నామినేషన్ వేసి అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. తనను కాదని బండారుకి టికెట్ ఇస్తే.. ఆయన బండారం బయటపెట్టి.. ఎలా నెగ్గుతారో చూస్తానంటూ సవాల్ విసిరారు.

అరకులో డబుల్ ధమాకా..

అరకు నియోజకవర్గంలో టీడీపీకి రెబల్ పోటు తప్పేలా లేదు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా చంద్రబాబు ప్రకటించిన టికెట్ అరకులోయే. ఈ స్థానంలో టీడీపీ తరఫున దొన్నుదొర నిలబడుతున్నారంటూ ప్రజలందరి ముందు ప్రకటించారు. చివరికి ఆ టికెట్‌ను బీజేపీకి కేటాయించారు. దీంతో దొన్నుదొర చంద్రబాబుపై యుద్ధం ప్రకటించారు. ఇదే స్థానం కోసం ఆశలు పెట్టుకున్న అబ్రహంను కూడా చంద్రబాబు నడిరోడ్డుపై వదిలేశారు. దీంతో అబ్రహం, దొన్నుదొర ఇద్దరూ చంద్రబాబు తీరుపై రగిలిపోతున్నారు. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా అబ్రహం కూడా నామినేషన్ వేశారు. దొన్నుదొర కూడా 24న నామినేషన్ వేస్తానని ప్రకటించారు.

అక్కడా తిరుగుబావుటా...!

పాడేరు, రంపచోడవరం నియోజకవర్గాల్లోనూ అసమ్మతి రగులుతోంది. పాడేరు టికెట్ ఆశించి భంగపడిన గిడ్డి ఈశ్వరి రెబల్‌గా బరిలోకి దిగుతానంటూ హెచ్చరించారు. అయితే.. కిల్లు రమేష్ నాయుడుకు హ్యాండ్ ఇచ్చి.. గిడ్డి ఈశ్వరికి టికెట్ ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ బీ–ఫారం ఈశ్వరికి ఇస్తే.. తాను రెబల్‌గా పోటీ చేస్తానని కిల్లు హెచ్చరించారు.

రంపచోడవరంలోనూ వంతల రాజేశ్వరి తిరుగుబాటు అభ్యర్థిగా బరిలో నిలిచి.. గెలిచి.. చంద్రబాబు, లోకేష్‌కు తన సత్తా చూపిస్తానని సవాల్ విసురుతున్నారు. ఇలా.. ప్రతి చోటా టీడీపీకి రెబల్స్ ఉచ్చు బిగుసుకుంటోంది. తిరుగుబాటు చేస్తామన్న నాయకులందర్నీ పిలిపించి అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ ఇస్తానంటూ చంద్రబాబు బుజ్జగిస్తున్నారు. బాబు హామీలను గమనించిన అసంతృప్త నేతలు అధికారంలోకి రాక ముందు హ్యాండి ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోరని మండిపడుతున్నారు. ఎన్నికల్లోనే తాడోపేడో తేల్చుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

పాడేరు టీడీపీలో గందరగోళం

- అభ్యర్థిగా గిడ్డి ఈశ్వరి పేరు తెరపైకి..
- ఇప్పటికే నామినేషన్ వేసిన కిల్లు రమేష్‌నాయుడు
- అయోమయంలో పార్టీ శ్రేణులు

పాడేరు: నియోజకవర్గ టీడీపీలో బంతాట మొదలైంది. చంద్రబాబు క్షుద్రరాజకీయాలకు, ఆయన తీసుకుంటున్న నిర్ణయాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు విసిగిపోతున్నారు. ప్రకటించిన అభ్యర్థులను తరచూ మార్చేయడం వల్ల వారికి ఏంచేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. పాడేరు అసెంబ్లీ టికెట్‌ను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి, మాజీ జీసీసీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్, బొర్రా నాగరాజు, కొట్టగుళ్లి సుబ్బారావు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ ఆశించడం తెలిసిందే. వీరికి కాకుండా ఇటీవల పార్టీలోకి వచ్చిన కిల్లు రమేష్ నాయుడు అభ్యర్థిగా చంద్రబాబు ప్రకటించడంతో వారంతా కంగుతిన్నారు. అధిష్టానంపై తిరుగుబాటుకు సిద్ధపడ్డారు. వీరిలో గిడ్డి ఈశ్వరి టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీచేస్తానని అధిష్టానాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన రమేష్‌నాయుడు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం ప్రకటన మేరకు శుక్రవారం టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేరు తెరపైకి వచ్చింది. అధిష్టానం హామీ మేరకు ఈనెల 22న టీడీపీ బి ఫారంతో నామినేషన్ వేస్తారని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ సమాచారంతో రమేష్‌నాయుడు నిరాశపడినట్టు తెలిసింది. చంద్రబాబు 'కూటమి' డ్రామాలతో టీడీపీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి.

'మిరియాల' నామినేషన్‌కు ముఖ్య నేతల డుమ్మా


రంపచోడవరం: రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీష దేవి శుక్రవారం నామినేషన్ వేశారు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలంతా నామినేషన్ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన శిరీషదేవికి కాకుండా పార్టీ కోసం పనిచేసిన వారిలో ఎవరికైనా టికెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేయడం తెలిసిందే. భారీ ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలతో నామినేషన్ దాఖలు చేయాలని భావించిన మిరియాల శిరీషదేవికి అనుకున్న స్థాయిలో రాకపోవడం నిరాశ మిగిల్చింది. రంపచోడవరంలో కీలకమైన టీడీపీ నేతలెవ్వరూ హాజరు కాలేదు. మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. మండలాల నుంచి కూడా పార్టీ శ్రేణులు హాజరు కాలేదు.

108లో ప్రసవం


108 వాహనంలో డెలివరీ చేసిన సిబ్బంది

ఎటపాక: మండల పరిధిలోని గుండాల గ్రామ సమీపంలో 108 వాహనంలో ఓ మహిళ ప్రసవించింది.ఎం.జలంతి అనే మహిళ రెండవ కాన్పుకు చింతూరు ఆస్పత్రికి వచ్చింది. అయితే అక్కడి వైద్యులు ఆమెను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయడంతో 108 వాహనంలో ఆమెను అక్కడికి తరలించారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున మార్గ మధ్యలో ఆమెకు పురిటినొప్పులు అధికమవడంతో వాహనాన్ని గుండాల సమీపంలో నిలిపి ఆశ కార్యకర్త సాయంతో జలంతికి ప్రసవ సేవలు చేశారు. మగ బిడ్డను జన్మనిచ్చింది. పైలట్ రవితేజ, ఈఎంటీ లక్ష్మణ్ సేవలందించారు. అనంతరం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు వారు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయాలపాలైన శివ

ఎటపాక: మండల పరిధిలోని పురుషోత్తపట్టణం వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రాయనపేట పంచాయతీ తాటాకులగూడెం గ్రామానికి చెందిన కాశిన శివ తన ద్విచక్రవాహనంపై భద్రాచలం నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకుపోవడంతో ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన శివను భద్రాచలం 108 వాహనంలో తరలించి చికిత్స అందిస్తున్నారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

వెలిసిన మావోయిస్టు పోస్టర్లు

ఎటపాక: మండల పరిధిలోని గౌరిదేవిపేట నుంచి తోటపల్లి బ్రిడ్జి వరకు భద్రాచలం, కూనవరం ప్రధాన రహదారిపై శుక్రవారం మావోయిస్టుల పేరిట పోస్టర్లు వెలిశాయి. భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు భద్రాద్రి కొత్తగూడెం–అల్లూరి సీతా రామరాజు డివిజన్ కమిటీ పేరుతో వీటిని చెట్లు, వంతెనలకు అతికించి ఉన్నాయి. వీటిలో ఇంద్రవెల్లి మృతవీరులు మృత్యుంజయులు, జల్ జంగిల్ జమీన్ ఇజ్జత్, అధికారం దక్కేవరకు దోపిడీ పాలక ప్రభుత్వాలను కూల్చివేసి నూతన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ వాటిలో ఉన్నాయి.

రక్తహీనత నివారణకు చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

చింతపల్లి రూరల్: గిరిజన పిల్లల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. శుక్రవారం ఆయన చింతపల్లి సీహెచ్‌సీతోపాటు , లోతుగెడ్డ, ఆర్‌వీ నగర్ ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలించారు. రక్తహీనత నివారణ మాత్రల పంపిణీ వివరాలను తెలుసుకున్నారు. మాతా శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని, వైద్యులు, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. డీపీసీ శేషు, డీపీఎస్ రామరాజు, క్షయ నివారణ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదల అభ్యున్నతి


పోలిపాక గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

కూనవరం: ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అమలుచేసి దేశానికి ఆదర్శకంగా నిలిచిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. పేదల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యమన్నారు. మండలంలోని పోలిపాక పంచాయతీ పరిధిలోని పోలిపాక, గుండువారిగూడెం, దూగుట్ట, కూళ్లపాడు గ్రామాల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపుల ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకుని వాటిని ప్రతి నెలా వడ్డీల రూపంలో పెరిగిపోతున్న అప్పులను కట్టలేక గతంలో మహిళలు ఇబ్బందులు పడే వారన్నారు. అప్పట్లో చంద్రబాబు మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా మహిళలను మోసం చేశారని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. గత ఎన్నికల ముందు జగనన్న చేపట్టిన పాదయాత్రలో మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక బ్యాంకు ఖాతాల్లో రుణం లేకుండా మాఫీ చేసి డ్వాక్రా మహిళల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు, ఈ విషయాన్ని మహిళలు గుర్తుపెట్టుకుని వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకొని రుణం తీర్చుకుందామన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నాగులపల్లి ధనలక్ష్మి అయిన తనను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామస్తులంతా జగన్‌కే తమ మద్దతు అని జై జగన్ అంటూ నినాదాలు చేశారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ఆవుల మరియాదాస్, పార్టీ మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, సర్పంచ్ సోందె ముత్తమ్మ, నాయకులు బాబు, గంగాధర్, భరతమూర్తి, రమేష్, పూర్ణానందం, వీర్రాజు, సునీత, శ్రీను పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వాన్ని గెలిపిద్దాం


అల్లమూల గ్రామంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: ఎన్నడూలేని విధంగా సంక్షేమం , అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపిద్దామని అరకు నియోజకవర్గ పార్టీ ఎన్నికల పరిశీలకులు జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీలో పలు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ పరిశీలకులు సుభద్ర పాల్గొని ప్రచారం చేశారు. సీఎం జగనన్న పాలనలో ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గ్రామాల్లో గ్రామస్తులకు వివరించారు. ఇందులో భాగంగా ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులతో మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో ప్రతి గ్రామాన అభివృద్ధి కార్యక్రమాలు చేసి చూపించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే చెందుతుందన్నారు. అన్ని వర్గాలు జగనన్న సంక్షేమ పథకాల ఫలాలు అందుకున్నారన్నారు.గతంలో చంద్రబాబు ఇచ్చిన ఒక్క హామీని అమలుచేయలేదని, మోసపూరిత హామీలు, మాటలను నమ్మవద్దని, ప్రతిపక్ష కూటములకు ఓట్లు వేయవద్దన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. మరింత సంక్షేమం, అభివృద్ధి ఫలాలు పొందేందుకు వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచులు నరసింగరావు, బాబూరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, నాయకులు జయదేవ్, రాంప్రసాద్, జగన్నాథం పడాల్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజవొమ్మంగిలో రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



దేవరమడుగులులో మహిళా పోలీసు చిన్నయమ్మకు రాజీనామ పత్రాలను అందజేస్తున్న గ్రామ వలంటీర్లు

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత, వాతంగి సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఇప్పటికే జడ్డంగి, వాతంగి, చికిలింత, వంచంగి సచివాలయల్లో రాజీనామాలు చేసిన వారి సంఖ్య 78 కి చేరిందని ఎంపీడీవో ఎల్. యాదగిరీశ్వరరావు విలేకరులకు తెలిపారు.

వై.రామవరం: మండలంలోని దేవరమడుగులు గ్రామ సచివాలయానికి చెందిన ఇద్దరు గ్రామ సచివాలయ వలంటీర్లు శుక్రవారం విధులకు రాజీనామ చేశారు. ఆగ్రామానికి చెందిన బట్ట వెంకటలక్ష్మి, పొత్తూరి బాలరాజు కలిసి రాజీనామా పత్రాలను సచివాలయ మహిళా పోలీసు డి.చిన్నయమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చంద్రబాబు గ్రామ వలంటీర్లపై చేసిన దారుణమైన వ్యాఖ్యలు భరించలేకే రాజీనామ చేశామన్నారు. ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించిన తాము జరగనున్న ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామని పేర్కొన్నారు.

విధుల్లో నిబంధనలు పాటించాలి


మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఉద్యోగుల శిక్షణలో మాట్లాడుతున్న ఎస్ఈ సుబ్రహ్మణేశ్వరరావు


శిక్షణ కార్యక్రమానికి హజరైన ఉద్యోగులు..

- మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రమణ్వేశ్వరావు
- ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ ప్రారంభం

ముంచంగిపుట్టు: ఉద్యోగులు విధుల్లో నిబంధనలు పాటించడం ముఖ్యమని మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం ఎస్ఈ ఏ.వి.సుబ్రహ్మణేశ్వరరావు అన్నారు.ఆంధ్ర –ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ఒనకడిల్లీలోని సివిల్ ఇంజనీర్ కార్యాలయంలో ఏపీ జెన్‌కో శిక్షణ ఇన్‌స్టిట్యూట్ విజయవాడకు చెందిన ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో జోలాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకడిల్లీ క్యాంప్‌ల ఓఅండ్‌ఎం(ఆపరేషనల్ అండ్ మేనేజ్‌మెంట్) ఉద్యోగులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. శిక్షణ తరగతులను ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రమణ్వేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్సనల్ డెవలప్‌మెంట్, టీం వర్కు, ఆరోగ్య పరిరక్షణ, ఆత్మ విశ్వాసం పెంపొందించే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, విధుల పట్ల అకింతభావంతో పనిచేయాలని, విద్యుత్ కేంద్రంలో పని చేసే ప్రతి ఒక్కరూ నిత్యం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఎస్ఈ సుబ్రమణ్వేశ్వరావు అన్నారు.అనంతరం జెన్‌కో శిక్షణ కేంద్రం జనరల్ మేనేజర్ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ శిక్షణ వల్ల ఉద్యోగులకు సర్వీసు, లీవ్ రూల్స్, రాయితీలు ఎలా పొందాలి వంటిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రాజెక్టు పరిధిలో 150 మందికి రెండు రోజులు శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటి వరకు శ్రీశైలం, సీలేరు, అప్పర్‌సీలేర్, నాగర్జునసాగర్ వంటి ప్రాజెక్టులలో 1500 మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. 2023 సంవత్సరం నుంచి ప్రాజెక్టులలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇంపాక్ట్ సంస్థ మోటివేటర్ సోనుశ్రీనివాస్,మాచ్‌ఖండ్ ఈఈలు గోవిందరాజులు,కురుష్‌ప్రధాన్,డిప్యూటీ ఈఈ శ్రీనివాస్,విజయవాడ డిప్యూటీ ఈఈలు రాజ్‌కుమార్,సత్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.